సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

అతిథి గృహం.. శిథిలం

- పర్యాటకులకు అందుబాటులో అద్దె
- శుభకార్యాలకూ అనువు
- మూత పడడంతో సందర్శకులు, స్థానికుల నిరాశ





సమావేశ మందిరం

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా పరిషత్ అతిథి గృహం శిథిలమై, మూతపడిపోయింది. ఇక్కడ బీచ్‌రోడ్డులో ఎగువపేటకు సమీపంలో 35 సంవత్సరాల క్రితం జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో నాలుగు గదులు, సమావేశ మందిరం, వేదిక ఉన్నాయి. అప్పట్లో ఇక్కడ ప్రైవేట్ హోటళ్లుగాని, అతిథి గృహాలు గాని ఉండేవి కావు. దీంతో సందర్శకులకు ఇది అనువుగా ఉండేది. అప్పట్లో ఈ గెస్ట్‌హౌస్‌లో గదులు రూ.వంద నుంచి రెండు వందలకు అద్దెకు ఇచ్చేవారు. ప్రభుత్వానికి చెందిన ఏకైక అతిథి గృహం కింద ఇది మాత్రమే ఉండేది. క్రమంగా గదుల అద్దె పెరిగినా రూ.400 వందల వరకు మాత్రమే ఉండేది. ఈ అద్దె పర్యాటకులకు అందుబాటులో ఉండడంతో చాలామంది ఇక్కడే బస చేసేవారు.

పర్యాటకులకు అద్దె భారం

ప్రస్తుతం భీమిలి, పరిసరప్రాంతాల్లో అనేక ప్రైవేట్ అతిథి గృహాలు, హోటళ్లు, రిసార్టులు ఉన్నాయి. అయితే వీటిలో ఒక గదికి రోజుకు రూ. మూడు వేలకు పైనే అద్దె ఉంటోంది. సాధారణ పర్యాటకులకు ఇంత అద్దె భారమవుతోంది. కొందరు తప్పనిసరై చెల్లిస్తున్నా.. మరికొందరు అంత అద్దె చెల్లించలేక వెనుతిరుగుతున్నారు. అదేకాకుండా తక్కువ ఖర్చుతో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు చేసుకోవడానికి అవకాశం లేక స్థానికులు నిరాశ చెందుతున్నారు. ఈ అతిథిగృహాన్ని వినియోగంలోకి తీసుకువస్తే సందర్శకులకు అందుబాటులో అద్దెలు ఉంటాయి. సమావేశ మందిరం, వేదిక కూడా ఉండటంతో అద్దెల ద్వారా ప్రభుత్వానికి ఆదాయమూ వస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పెళ్లిళ్లకు అనువైన వేదిక

ఈ గెస్ట్ హౌస్‌ను ఆనుకుని సమావేశ మందిరం ఉంది. దీనికి అద్దె రోజుకు రూ. వెయ్యి ఉండేది. దాంతోపాటు విశాలమైన ప్రదేశం, అందులో ఒక వేదిక కూడా ఉండేది. ఇది పేద, మధ్య తరగతి వారికి ఎంతో సదుపాయంగా ఉండడంతో నిత్యం పెళ్లిళ్లు, ఇతర శుభకార్యక్రమాలతో పాటు సమావేశాలు జరిగేవి.



నిర్వహణ లేక అస్తవ్యస్తంగా గది

పట్టించుకోని అధికారులు

అన్ని వర్గాలవారికి ఎంతో అందుబాటులో ఉన్న ఈ అతిథి గృహం దెబ్బతింటూ వచ్చింది. అధికారులు దీని గురించి సరిగ్గా పట్టించుకోకపోవడంతో కొంత కాలానికి పూర్తిగా పాడై, శిథిలావస్థకు చేరి, పది సంవత్సరాల క్రితం మూత పడిపోయింది. దీంతో సందర్శకులకు బస చేయడానికి, అలాగే స్థానికులకు శుభకార్యక్రమాల నిర్వహణకు కూడా అవకాశం లేకుండా పోయింది. అప్పటి నుంచి ఇక్కడ ప్రభుత్వ అతిథి గృహం లేకుండా పోయింది.



మూతపడ్డ జిల్లా పరిషత్ అతిథి గృహం



అందరికీ అందుబాటులో ఉండేది

భీమిలిలో అతిథి గృహం ఇక్కడ అందరికీ అందుబాటులో ఉండేది. బీచ్‌కు దగ్గరగా ఉండడంతో సందర్శకులకు ఎంతో సదుపాయంగా ఉండేది. నిత్యం ఏదో ఫంక్షన్లు, సమావేశాలు జరగడంతో సందడిగా ఉండేది. అలాంటి గెస్ట్‌హౌస్ మూతపడిపోయింది. దీనిని మళ్లీ అందుబాటులోకి తేవాలి.

– ఎం.ఆనందరావు, భీమిలి



కొత్తది నిర్మించాలి

ఈ అతిథి గృహం ఉన్నప్పుడు అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉండేది. మూతపడిపోవడంతో ప్రభుత్వ అతిథిగృహం ఏదీ లేకుండా పోయింది. కొత్త భవనం నిర్మిస్తే చాలా బాగుంటుంది. బీచ్ దగ్గర్లో కాబట్టి పర్యాటకులకు అందుబాటులో ఉంటుంది.

– కె.ముత్యాలరావు, భీమిలి



నిరుపయోగంగా ప్రాంగణంలోని వేదిక



ప్రతిపాదనలు పంపిస్తాం

శిథిలావస్థకు చేరుకున్న అతిథి గృహం, సమావేశ మందిరాల గురించి జిల్లా పరిషత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. ఇక్కడ వీటి ఆవశ్యకత గురించి తెలియజేస్తాం. కొత్తది నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపిస్తాం.

– ఎస్.హనుమంతరావు, ఎంపీడీవో

క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ

తగరపువలస: స్థానిక తెలగా సేవా సంఘం వైస్ ప్రెసిడెంట్ రంగూరి గిరిధర్ చిట్టివలసలో వంద మంది పేదలకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. తన తండ్రి, మాజీ కౌన్సిలర్, తగరపువలస తెలగా సంఘం అధ్యక్షుడు అయిన రంగూరి ప్రసాదరావు వర్ధంతి సందర్భంగా వీటిని పంపిణీ చేసినట్టు తెలిపారు. సంఘం కార్యదర్శి నార్ల వాసు, కోశాధికారి మేకల రమేష్, ఫ్రెండ్స్ ఫౌండేషన్ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

నవోదయ పరీక్షకు 275 మంది హాజరు

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన నవోదయ విద్యాలయ తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించారు. కేంద్రంలో 528మంది పరీక్ష రాయాల్సి ఉండగా 275 మంది హాజరయ్యారని ప్రధానోపాధ్యాయుడు రవి తెలిపారు.

అప్పలస్వామికి చిన్న శ్రీను నివాళులు



అప్పలస్వామి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న చిన్న శ్రీను

తగరపువలస: ఆనందపురం మండలం చందక పంచాయతీ వెంకటాపురానికి చెందిన ఇల్లపు అప్పలస్వామికి వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు శనివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అప్పలస్వామి ఇటీవల మరణించడంతో ఆయన కుమారుడు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు ఇల్లపు వెంకట జగన్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, బంటుపల్లి మణింకరనాయుడు, పాండ్రంగి శ్రీను, గండ్రెడ్డి శ్రీను, బోని బంగారునాయుడు, బోని అప్పలనాయుడు, పిన్నింటి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా రామునాయుడు



రామునాయుడుకు నియామకపత్రం అందిస్తున్న ఆదిశేషు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంగివలసకు చెందిన అక్కరమాని రామునాయుడు బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు ఆయనకు నియామకపత్రం అందించారు. ప్రస్తుతం రామునాయుడు స్థానిక పీఏసీఎస్ అధ్యక్షునిగా, ఆయన సతీమణి అక్కరమాని పద్మ జీవీఎంసీ ఒకటోవార్డు కార్పొరేటర్‌గా ఉన్నారు.

గాయత్రీ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



కలశాలతో జలం తీసుకువెళ్తున్న మహిళలు

పద్మనాభం: మండలంలోని బుడ్డివలస అగ్రహారం పంచాయతీ లింగన్నపేటలో మూడు రోజుల పాటు జరగనున్న వేద మాత గాయత్రీ దేవి ఆలయ ఆశ్రమ 12 వార్షిక వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గాయత్రి, లలిత, దుర్గాదేవి విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. మహిళలు కలశాలతో జలం తీసుకుని అమ్మవార్ల వెంట సాగారు. లింగన్నపేట, బుడ్డివలస, బుడ్డివలస–అగ్రహారం, కోరాడ, బి.ఆర్.తాళ్లవలస గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని అయ్యప్ప దేవాలయ పునర్నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ ఆలయం కొంతకాలంగా జీర్ణావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణానికి ఆలయ నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమంలో ఆలయ ధర్మకర్త బి.బాలకృష్ణ(పాండే) దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు కొమ్మినేని ఎర్రినాయుడు, కార్యదర్శి మొకర నర్సింగరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ముప్పు



సిటీ బస్సు కిటికీలోకి పాక్షికంగా వెళ్లిపోయిన కలప

తగరపువలస: స్థానిక వెంకటేశ్వరమెట్ట వద్ద సర్వీస్ రోడ్డుపై శనివారం ఉదయం తృటితో ముప్పు తప్పింది. విశాఖ నుంచి విజయనగరం వెళ్తున్న సిటీబస్సుకు ఎదురుగా తగరపువలస వైపు కలపతో వెళ్తున్న ట్రాక్టర్ వచ్చింది. ఈ రెండు వాహనాలు దాటిపోతున్న సమయంలో ట్రాక్టర్ కుడివైపు చొచ్చుకు వచ్చిన కలప బస్సు వెనుక కిటీకీలలోకి వెళ్లి లాక్ అయింది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును ఆపివేశాడు. దీంతో సమీపంలో ఉన్న భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ట్రాక్టర్, బస్సు డ్రైవర్లకు సకాలంలో సూచనలు చేశారు. దీంతో వాహనాలు ముందుకు వెళ్లడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా ఇరువైపులా పాక్షికంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ట్రాక్టర్, లారీ వంటి ఓపెన్ వాహనాలపై కలప, ఇరన్ వంటివి తరలించేటప్పుడు ఎర్రటి క్లాత్‌ను వేలాడదీయవలసి ఉన్నా చాలామంది నిబంధనలు పాటించకపోవడంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి.

ముగిసిన ఎలిమెంటరీ ఉపాధ్యాయుల శిక్షణ



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

మధురవాడ: మధురవాడ ఐటీ సెజ్‌లోని శ్రీ కలష్ ఎడ్యుకేషన్ స్కిల్స్ సెంటర్‌లో ఎలిమెంటరీ ఉపాధ్యాయులకు వారం రోజుల పాటు నిర్వహించిన ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) 9వ బ్యాచ్ శిక్షణ శనివారంతో ముగిసింది. దీనిని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ డాక్టర్ చంద్రశేఖరావు సందర్శించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఆనందకర వాతావరణంలో అభ్యసన ప్రక్రియ జరగాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు తరగతి గదిలో అమలు పరచాలని సూచించారు. మంచి బోధనాభ్యసన సామగ్రి తయారు చేసిన ఐదుగురు ఉపాధ్యాయులను సత్కరించారు. విశాఖ, అల్లూరి జిల్లాల నుంచి ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఎంవోలు జి.లక్ష్మి పలువురు రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

జోరుగా లడ్డూ విక్రయాలు



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి దర్శనానికి శనివారం వేలాది మంది భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన వారంతో పాటు భీష్మ ఏకాదశి కూడా కలిసి కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా శ్రీవారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులు స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం భక్తులు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు, కోలాట ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఆలయం వద్ద శ్రీవారి లడ్డూ విక్రయాలు జోరుగా సాగాయి. ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వీఆర్వో అవకతవకలపై చర్యలకు ఆదేశం

తగరపువలస: భీమిలి మండలంలో ఇటీవల జరిగిన రీసర్వేలో ఒక వీఆర్వో చేతివాటం కారణంగా నష్టపోయిన బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మండలానికి చెందిన ఒక వ్యక్తి తన ఆస్తిని ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెకు పంపకాలు చేశారు. కుమారులు తమ ఆస్తిని విక్రయించేసుకుని, రీసర్వే సమయంలో వారి సోదరి ఆస్తిని వీఆర్వో సాయంతో ఎల్‌పీఎం పొంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనిని గ్రహించిన భోగాపురం మండలం గూడెపువలసకు చెందిన ఆమె వారసులు మేనమామలతో పాటు వారికి సహకరించిన వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రీసర్వే సమయంలో అవకతవకలకు పాల్పడిన వీఆర్వోపై స్టేట్‌మెంట్ నమోదు చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రస్తుత వీఆర్వో ఆ పనిలో నిమగ్నమై ఉన్నాడు. దీనిపై స్టేట్‌మెంట్ నమోదు చేస్తున్న వీఆర్వోను సంప్రదించగా వివరాలు వెల్లడించడానికి నిరాకరించారు.

తపశ్శక్తి సంపన్నులైన మహర్షులకు భారతావని నెలవు

మధురవాడ: ఎంతో గొప్ప తపశ్శక్తి సంపన్నులైన మహర్షులకు భారతావని ఆవాసంగా ఉందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. దేవతలు సైతం మహర్షులను దర్శించి, వారితో సంభాషించటానికి భూలోకానికి వచ్చేవారని, మహర్షుల చేతనే ఈ దేశం ఎంతగానో కీర్తించబడిందని పేర్కొన్నారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా 15వ రోజు శనివారం అరణ్యకాండలో పలు అంశాలను తెలియజేశారు. అగస్త్య మహర్షి గొప్పదనమును లక్ష్మణుడికి తెలియజేశారని చాగంటి వివరించారు.

ఘనంగా రాధాకృష్ణ ఆలయ వార్షిక వేడుకలు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ గొల్లవీధిలో రాధాకృష్ణుల ఆలయ రెండో వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణులకు ఉదయం పంచామృతాలతో అభిషేకించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. సహస్ర తులసిపత్రి, పుష్పాలతో పూజలు చేశారు. అనంతరం అర్చకుడు వెంకటరమణ శర్మ రుక్మిణీ కల్యాణం, శాంతిహోమం జరిపించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో నారాయణసేవ, సాయంత్రం పల్లకిసేవ నిర్వహించారు.

అధికారుల దృష్టికి ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలు

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకిలో శనివారం అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్ల జిల్లా సమావేశం జరిగింది. రాష్ట్ర సభ్యులు అబ్దుల్ అమానుల్లా, ఫరూక్, కార్తీక్ తదితరులు హాజరైన ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రాథమికంగా ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. వివిధ సర్వేల పనిభారం తమపై పడుతోందన్నారు. దీంతో ఇంజనీరింగ్ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయన్నారు. తమ సమస్యలను వినతిపత్రాల ద్వారా ఉన్నతాధికారులకు తెలియజేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే రేషనలైజేషన్ ప్రక్రియలో ఇప్పటి వరకు పదోన్నతులు లేనివారికి అర్హతను బట్టి జాబ్ రోల్ రీ డిజిగ్నేట్ చేసి ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

మర్యాదపూర్వక కలయిక



చిన్న శ్రీనును కలిసిన రెండోవార్డు కార్యకర్తలు, నాయకులు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావును పార్టీ రెండో వార్డు నాయకులు, కార్యకర్తలు శనివారం కలిశారు. విజయనగరంలోని ఆయన నివాసంలో కలిసి, సత్కరించారు. పార్టీ యూత్ నాయకుడు నీలాపు సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి జేఏసీ జాతీయ అధ్యక్షుడు మారం బాల బ్రహ్మారెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి నాయకులను, కార్యకర్తలను చిన్న శ్రీనుకు పరిచయం చేయగా ఆయన పేరుపేరునా అందరినీ పలకరించారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మిక నాయకులు దల్లి అప్పలరెడ్డి, రామారావు, ఎర్రయ్యరెడ్డి, వేమల అప్పలరెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర రైల్వే స్టేషన్లన్నీ విశాఖ జోన్‌లో చేర్చాలి

తగరపువలస: త్వరలో ఏర్పాటు కానున్న విశాఖ రైల్వే జోన్‌లో ఉత్తరాంధ్రకు చెందిన రైల్వే స్టేషన్లు అన్నీ ఉండేలా చర్యలు తీసుకోవాలని భీమిలి ఏరియా సీపీఐ కార్యదర్శి కానూరి రాంబాబు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ విశాఖకు రైల్వే జోన్ కావాలన్నది సీపీఐ 20 ఏళ్ల నాటి కల అని పేర్కొన్నారు. విశాఖకు చేరువలో ఉన్న కొత్తవలస మొదలుకుని గతంలో రాయగడ జోన్‌లోకి వెళ్లిపోయిన ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాలలోని రైల్వే స్టేషన్లను ఈ జోన్‌లో చేర్చాలన్నారు. ఈ విషయంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు, సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, ఎం.సన్నిబాబు, కె.రమేష్ మాట్లాడారు.

శ్రీనివాసులు నాయుడుకు బీటీఏ మద్దతు

మధురవాడ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ మద్దతుతో పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులు నాయుడుకు తమ సంఘం మద్దతు ప్రకటిస్తోందని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) ఉత్తరాంధ్ర సమన్వయకర్త గండి ప్రకాష్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పదో తేదీ నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పి.రాం ప్రసాద్ తెలిపారు. ఉదయం 9 నుంచి 12, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఉంటాయని తెలిపారు. ఈ కళాశాల విద్యార్థులతో పాటు భీమిలి పరిధిలోని తొమ్మిది కళాశాలల విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరవుతారన్నారు. కళాశాలలో 367మంది జనరల్ విద్యార్థులు, 400మంది ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

ఉచిత వైద్యశిబిరం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. తన సోదరుడు అప్పారావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా నూతన గ్రంథాలయం వద్ద నిర్వహించే వైద్య శిబిరంలో మందులు కూడా పంపిణీ చేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు తెలిపారు.

159 మందికి కంటి వైద్య పరీక్షలు

భీమునిపట్నం: భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కీతినపేట సన్‌స్కూల్లో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 159 మందికి శంకర్ ఫౌండేషన్ వైద్యులు కంటి పరీక్షలు చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ శిబిరంలో 55 మందికి కంటి ఆపరేషన్లు, 37మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారన్నారు.త్వరలోనే ఏర్పాట్లు చేస్తామన్నారు. వైద్యులు రుచిత, వివేక్‌వర్మ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

